# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 77 సోమవారం 15-12-2025 పేజీలు : 4 వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైం కౌంటర్ News

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## హైదరాబాద్ బిర్యానీ, హలీమ్‌కు ఫిదా అయిన మెస్సీ

# డిన్నర్ మెనూ ఇదే..!



భారత పర్యటనలో ఉన్న సాకర్ గ్రేట్ మెస్సీ.. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన సంగతి తెలిసిందే. ఇక మెస్సీకి తెలంగాణ ప్రభుత్వం స్వాగత సత్కారాలు, ఘనమైన ఆతిథ్యం ఇచ్చింది. ఈ క్రమంలోనే తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో బస చేసిన మెస్సీ.. హైదరాబాద్ వంటకాలకు ఫిదా అయ్యారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్ మటన్ బిర్యానీ, హలీం టేస్ట్ చేసి.. బాగా ఎంజాయ్ చేశారు. ఇంకా మెస్సీ డిన్నర్‌లో ఏమేం వంటకాలు ఉన్నాయంటే? భారత్‌లో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ పర్యటన కొనసాగుతోంది. శనివారం భారత్‌లో అడుగుపెట్టిన మెస్సీ.. మొదట కోల్‌కతా.. ఆ తర్వాత హైదరాబాద్‌లో పర్యటించారు. అనంతరం ముంబైకి వెళ్లారు. ఇక కోల్‌కతా సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సీ రాక సందర్భంగా తలెత్తిన గందరగోళం.. ఆయన ఫ్యాన్స్‌కు తీవ్ర నిరాశకు గురి చేసింది. కానీ హైదరాబాద్ టూర్ మాత్రం.. అటు మెస్సీకి, ఇటు తెలుగు ప్రజలకు బాగా గుర్తుండిపోయేదిగా నిలిచింది. ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో సింగరేణి ఆర్ఆర్ టీమ్, అపర్ణ మెస్సీ టీమ్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ ఆడటం.. ఫ్యాన్స్‌లో ఫుల్ జోష్ నింపింది. ఈ సందర్భంగా హైదరాబాదీ వంటకాల రుచిని మెస్సీ చూశారు. ఈ క్రమంలోనే డిన్నర్‌లో హైదరాబాదీ మటన్ బిర్యానీ, హలీమ్ బాగా ఇష్టంగా తిన్నారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మెస్సీ బస చేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన మెస్సీకి ఫలక్‌నుమా ప్యాలెస్‌లోని నిజాం లగ్జరీ సూట్ కేటాయించారు. ఉప్పల్‌లో ఫ్రెండ్లీ మ్యాచ్ తర్వాత.. రాత్రి నిర్వహించిన డిన్నర్‌లో హైదరాబాదీ మటన్ బిర్యానీ ఇష్టంగా ఆరగించారు. అలాగే హలీమ్‌ను కూడా వడ్డించారు. ఇవి మాత్రమే కాకుండా నిజాం వంటకాలైన మరగ్, పాయా, పన్నీర్ టిక్కా, కబాబ్, దాల్, నాన్ రోటీలు, బడల్ కా మీటా, ఖుర్బానీ కా మీటా, మలాయ్ కుల్ఫీ, ఇటాలియన్ ఫుడ్ కూడా మెనూలో ఏర్పాటు చేశారు. ఈ డిన్నర్‌లో సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఇక తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్ అందాలు చూసి.. మెస్సీ మైమరిచిపోయారు. ఇక ఫలక్‌నుమా ప్యాలెస్‌లో 101 మంది ఒకేసారి కూర్చొని భోజనం చేసే నిజాం డైనింగ్ టేబుల్‌ను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. హైదరాబాద్ ఆతిథ్యం మరిచిపోలేనిదని కితాబు ఇచ్చారు. ఇక శనివారం హైదరాబాద్‌కు వచ్చిన మెస్సీ నిన్న ఇక్కడే బస చేశారు. ఆదివారం స్పెషల్ ఫ్లైట్‌లో లియోనెల్ మెస్సీ బృందం.. ఉదయం 10.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ముంబై బయల్దేరి వెళ్లింది. అక్కడ వాంఖడే స్టేడియానికి మెస్సీ చేరుకోనున్నారు.





## దేవుడిని కూడా వదలట్లేదు..



ప్రజారోగ్యానికి ముప్పు తెస్తున్న కల్తీ నెయ్యి తయారీదారుడిని హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. సికింద్రాబాద్‌లో టిఫిన్ సెంటర్ నడుపుతూ, కొబ్బరి నూనె, డాల్డాతో కల్తీ నెయ్యి తయారుచేసి 'లుకా' బ్రాండ్‌తో విక్రయిస్తున్న అన్నమలైని పట్టుకున్నారు. సుమారు 200 కేజీల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి వ్యాపారాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై హైదరాబాద్ నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా కల్తీ నెయ్యిని అమ్ముతున్న ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ సెకండ్ బజార్‌కు చెందిన అన్నమలై మోండా మార్కెట్‌లో టిఫిన్ సెంటర్‌ను నడుపుతున్నాడు. అయితే ఆ వ్యాపారంలో నష్టాలు రావడంతో, అన్నమలై అడ్డదారి పట్టి మార్కెట్‌లో ఆవు నెయ్యికి ఉన్న అధిక డిమాండ్‌ను అలుసుగా తీసుకున్నాడు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందాలనే దురుద్దేశంతో అతను ఆరోగ్యానికి హానికరం అయిన, చౌకగా లభించే పదార్థాలను ఉపయోగించి కల్తీ నెయ్యి తయారీకి పూనుకున్నాడు. అన్నమలై ప్రధానంగా కొబ్బరి నూనె, డాల్డా (వనస్పతి), కొన్ని రకాల ఫుడ్ కలర్స్‌ను కలిపి కల్తీ ఆవు నెయ్యిని తయారు చేస్తున్నాడు. ఈ కల్తీ నెయ్యిని అతను 'లుకా' అనే బ్రాండింగ్ పేరుతో ఒక లీటరు ప్యాకెట్‌లలో ప్యాక్ చేసి, మార్కెట్‌లో లీటరు స్వచ్ఛమైన నెయ్యి ధరకు కొద్దిగా తక్కువగా అంటే రూ.600 లకు విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నాడు. అలాగే పూజా స్టోర్లలోనూ విక్రయిస్తున్నాడు. పూజా సామాగ్రిలో ఆవు నెయ్యి ప్రధానం కావటంతో.. కల్తీ నెయ్యిని ఆవునెయ్యిగా మార్చి దేవుడిని కూడా వదలకుండా కల్తీ చేస్తున్నాడు. అన్నమలై తయారు చేస్తున్న ఈ కల్తీ నెయ్యి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా దీర్ఘకాలికంగా గుండె జబ్బులు, కొవ్వు సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉందని పోలీసుల విచారణలో తేలింది. విశ్వసనీయ సమాచారం అందుకున్న నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు.. అన్నమలై ఇంట్లో, టిఫిన్ సెంటర్‌లో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు 200 కేజీల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అన్నమలైపై ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇలాంటి కల్తీ ఆహార పదార్థాలు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే ఇలాంటి వ్యాపారాలను సహించబోమని పోలీసులు హెచ్చరించారు. పండుగల సీజన్లలో ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో ఆహార నాణ్యతపై మరింత నిఘా పెంచుతామని అధికారులు తెలిపారు.







## ఎస్పీ బాలు విగ్రహం వివాదం



హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహంపై ఏర్పాటుపై తెలంగాణ వాదుల నుంచి వ్యతిరేకత వస్తున్న సంగతి తెలిసిందే. ఈ వివాదంపై కల్వకుంట్ల కవిత స్పందించారు. తెలంగాణ ఉద్యమ గీతాన్ని పాడటానికి బాలు నిరాకరించారని.. అందుకే రవీంద్ర భారతి వంటి తెలంగాణ సాంస్కృతిక వేదిక వద్ద విగ్రహం పెట్టడం సరికాదని కవిత అన్నారు. తెలంగాణ కళాకారుల విగ్రహాలు పెట్టాలని ఆమె తేల్చిచెప్పారు. విగ్రహం ఏర్పాటు చేయడానికి వేరే చోటు చూసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రాంగణంలో ఏర్పాటు చేయదలచిన ప్రముఖ గాయకుడు ఎస్పీ బాల సుబ్రమణ్యం విగ్రహంపై వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయినా తెలంగాణ వాదులు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రాన్ని ఊపేసిన, ప్రతిఒక్కరిలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన.. "జయ జయహే తెలంగాణ.." గీతం పాడమంటే బాలసుబ్రహ్మణ్యం నిరాకరించారని చెప్పారు. అందుకే ఆయన విగ్రహం రవీంద్ర భారతి వంటి తెలంగాణ సాంస్కృతిక వేదిక వద్ద పెట్టడాన్ని తెలంగాణ వాదులంతా వ్యతిరేకిస్తున్నారని కవిత అన్నారు. కవిత వ్యాఖ్యలతో తెలంగాణ వాదులు చేస్తున్న వాదనకు బలం చేకూరినట్లు అయింది. రవీంద్ర భారతిలో ఏర్పాటు చేయనున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం విషయంలో తాను తెలంగాణ వాదులకే మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఏస్పీ బాలు విగ్రహం రవీంద్ర భారతి వద్ద పెట్టవద్దని.. దాని కోసం ఇంకేదైనా స్థలం చూసుకోవడం మంచిదని నిర్వాహకులకు కవిత సూచించారు. అంతేకాకుండా రవీంద్ర భారతిలో కేవలం తెలంగాణ కళాకారుల విగ్రహాలు మాత్రమే పెట్టాలని తేల్చిచెప్పారు.రవీంద్ర భారతిలో ఏర్పాటు చేయనున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం విషయంలో తాను తెలంగాణ వాదులకే మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఏస్పీ బాలు విగ్రహం రవీంద్ర భారతి వద్ద పెట్టవద్దని.. దాని కోసం ఇంకేదైనా స్థలం చూసుకోవడం మంచిదని నిర్వాహకులకు కవిత సూచించారు. అంతేకాకుండా రవీంద్ర భారతిలో కేవలం తెలంగాణ కళాకారుల విగ్రహాలు మాత్రమే పెట్టాలని తేల్చిచెప్పారు.ఎస్పీ బాలు విగ్రహాన్ని తెలంగాణలో పెట్టాల్సిన అవసరం లేదని తెలంగాణ ఉద్యమకారుడు పృథ్వీరాజ్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పుట్టిన ఎందరో ప్రముఖులు ఉన్నారన్నారు. ముందుగా వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జానపద సినిమాలతో ప్రసిద్ధి చెందిన కత్తి కాంతారావు, ముచ్చర్ల సత్యనారాయణ, వరంగల్ శంకర్, సారంగపాణి, గద్దర్ లాంటి వారి విగ్రహాలు పెట్టాలన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, పైడి జయరాజ్ లాంటి తెలంగాణ ప్రముఖుల విగ్రహాలు పెడితే మంచిదని చెప్పారు.

## రేషన్ కార్డు దారులకు బిగ్ అలర్ట్..




రాష్ట్రంలో రేషన్ కార్డుల్లోని ప్రతి సభ్యుడు డిసెంబర్ 31వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ తుది గడువును ప్రకటించింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ నమోదు చేయని వారి రేషన్ సరఫరాను నిలిపివేస్తామని అధికారులు హెచ్చరించారు. టెక్నికల్ సమస్యల కారణంగా ఈ-కేవైసీ పూర్తి చేయడంలో ఇబ్బందులు ఉన్నందున.. గడువు పొడిగించాలని రేషన్ కార్డుదారులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు.. కొత్తగా రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ తాజాగా కీలక హెచ్చరిక జారీ చేసింది. రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతీ ఒక్క సభ్యుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు తేల్చి చెప్పారు. గత 2 ఏళ్లుగా ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ.. చాలా మంది కార్డుదారులు ఇప్పటికీ పూర్తి చేయకపోవడంపై అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ 31వ తేదీ లోపు మిగిలిన వారందరూ తప్పనిసరిగా తమ ఈ-కేవైసీని పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ గడువు విధించింది. ఈనెల 31వ తేదీ లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయని యూనిట్ల రేషన్ సరఫరాను నిలిపివేస్తామని.. వారి రేషన్ కోటా రద్దు అవుతుందని అధికారులు మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ-కేవైసీ పూర్తి చేయడానికి.. రేషన్ కార్డులో నమోదైన సభ్యులు అందరూ తమ సమీపంలోని రేషన్ దుకాణాలకు వెళ్లి.. ఈ-పాస్ మెషీన్‌లో బయోమెట్రిక్ వేలిముద్రలు నమోదు చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు. అయితే.. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా కొంతమంది ఫింగర్ ప్రింట్స్.. ఆ ఈ-పాస్ మెషీన్‌లో నమోదు కావడం లేదని కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సాంకేతిక లోపాల కారణంగా ఈ-కేవైసీ పూర్తి చేయకపోతే.. అది తమ తప్పు ఎలా అవుతుందని జనం అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. రేషన్ కోటా రద్దు అవుతుందనే ఆందోళన వారిలో నెలకొంది. దీంతోపాటు.. ఈ-కేవైసీ గడువును కూడా డిసెంబర్ 31వ తేదీ వరకు విధించగా.. దాన్ని ఆ తర్వాత కూడా పొడిగించాలని పలువురు వినియోగదారులు అధికారులను కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో ఇటీవల మంజూరైన కొత్త రేషన్ కార్డుదారులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. తమకు రాకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం.. వంటగ్యాస్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అందుతున్నప్పటికీ.. కొత్త రేషన్ కార్డులు పొందిన వారికి ఈ పథకాలు అందడం లేదని వారు వాపోతున్నారు. తమకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రధాని మోదీ కోసం 'అఖండ 2' స్పెషల్ షో..




బ్లాక్ బస్టర్ 'అఖండ' సీక్వెల్ గా తెరకెక్కిన 'అఖండ 2: తాండవం' బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్ లో బాలకృష్ణ మాట్లాడుతూ.. సినిమా చూసిన వారంతా సనాతన హైందవ ధర్మం మీసం మెలేసిందని అంటున్నారని చెప్పారు. సనాతన ధర్మం, భారతీయ మూలాలను ప్రతిబింబించే ఈ సినిమా అందరినీ ఆకట్టుకుందని అన్నారు. సినిమా విజయానికి కారణమైన తెలుగు ప్రేక్షకులకు, యావత్ దేశ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. 'అఖండ' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత, దానికి సీక్వెల్ గా నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలిసి చేసిన సినిమా 'అఖండ 2: తాండవం'. 14 రీల్స్ బ్యానర్ పై రూపొందిన ఈ పాన్ ఇండియా మూవీ ఇటీవలే థియేటర్లలో రిలీజైంది. తొలి రోజు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లో సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. "అందరూ మహానుభావులు కాలేరు. శివుడు ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదు అంటారు. ఒక పని కొరకు భగవంతుడు కొంతమందిని ఎంచుకుంటాడు. ఇవాళ చాలా సంతోషంగా ఉంది. అఖండ 2 సినిమా విడుదలై ఇంత విజయవంతంగా ప్రదర్శించబడుతున్నందుకు మా తెలుగు ప్రేక్షక దేవుళ్లకే కాదు, యావత్ భారతదేశపు ప్రజలందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేసుకుంటున్నాను. ఇంతమంది పాఠం ఇచ్చినందుకు మేరుకు కూడా రుణం తీర్చుకోవాలి. ఏ ఉద్దేశ్యంతో ఈ సినిమా తీశామో.. ఆ ఉద్దేశాన్ని మీరు పాటించాలి" అని అన్నారు. "అఖండ సినిమా చూసి, సనాతన హైందవ ధర్మం మీసం మెలేసిందని అందరూ అంటున్నారు. మంత్రోచ్చారణ, వేదం, మన భారతదేశపు మూలాలు, మన ధర్మం, మన గర్వం, మన తేజస్సు కలగలిపిన సినిమా 'అఖండ 2' అని ఆబాలగోపాలం అంటున్నారు. ఇంత అద్భుతమైన సినిమా ఇచ్చారని ఆంధ్రా తెలంగాణే కాదు.. ప్రపంచం మొత్తం కోడైకూస్తోంది. ఈ సినిమాలో ఒక్కో డైలాగ్ ఒక్కో ఆణిముత్యం.. ప్రతి సీను ఒక ఉద్వేగం, ఒక ఉద్రేకం, ఒక ఉత్తేజ ప్రకంపనం అంటున్నారు' "సినిమాని మనిషి నిత్యావసర వస్తువుగా ఎంచుకున్నాడు. అందుకే ఎలాంటి సినిమాలు తీయాలని ఇండస్ట్రీ పెద్దలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఈరోజు నాకు చాలా గర్వంగా ఉంది. ఇప్పటివరకూ ఐదు సినిమాలు తీశాం. ఆరోది కూడా రాబోతోంది. చరిత్రలో చాలా మంది ఉంటారు. కానీ సృష్టించిన చరిత్రను మళ్లీ మళ్లీ తిరగరాసి తిరిగి చరిత్ర సృష్టించే వాడు ఒక్కడే. అది ఒక తెలియని శక్తి. 'ఏమి చూసుకుని రా బాలకృష్ణకు అంత పొగరు' అని చాలా మంది అంటారు. నన్ను చూసుకునే నాకు పదునైన పొగరు అంటాను. 'ఎవరిని చూసుకొని ఇంత ధైర్యం' అని ఉలిక్కిపడి చస్తుంటారు. నా వ్యక్తిత్వమే నన్ను ఉసిగొలిపే విప్లవం. వీడికి అన్నీ తెలుసా? అని అనుకుంటారు. నన్ను నేను తెలుసుకోవడమే నాకు తెలిసిన గొప్ప విద్య ఏముంటుంది అని ఒక సవాలుగా నిలబడతాను. ఇదంతా పొగరు కాదు. అది ఎక్కడి నుంచి వస్తుందో నాకు తెలియదు. అంతా ఆ పరమేశ్వరుడి దయ" అని బాలకృష్ణ అన్నారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. త్వరలో ఢిల్లీలో 'అఖండ 2' సినిమా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 'అఖండ 2' షోను ప్రధాని మోదీ కూడా చూడబోతున్నారని తెలిపారు.

## దొరికితే రూ.10 వేలు ఫైన్..


న్యూ ఇయర్ జోష్ మామూలుగా ఉండదు, కానీ పోలీసులు మాత్రం కఠిన నిబంధనలు పెట్టారు. హోటళ్లు, క్లబ్బులు 15 రోజుల ముందే అనుమతి తీసుకోవాలి. అశ్లీల నృత్యాలు, బాణసంచా నిషేధం. అర్ధరాత్రి 1 గంట వరకు మాత్రమే సౌండ్, అది కూడా 45 డెసిబుల్స్ లోపే. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదు. మహిళల భద్రతకు షీటీమ్స్ రంగంలోకి దిగుతున్నాయి. డిసెంబరు 31, జనవరి 1 న్యూ ఇయర్ జోష్ మామూలుగా ఉండదు. యూత్ ఇప్పట్నుంచే వేడుకలు పక్కా ప్రణాళికలు రచిస్తుంటారు. ముక్క, చుక్కతో పాటు చిందులు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటుంటారు. అయితే వేడుకల నిర్వహణకు సంబంధించి నగర పోలీసులు కఠిన నిబంధనలను ప్రకటించారు. వేడుకలు నిర్వహించే స్టార్ హోటళ్లు, క్లబ్స్, బార్ అండ్ రెస్టారెంట్స్, పబ్‌ల నిర్వాహకులు 15 రోజుల ముందే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని నగర సీపీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. వేడుకలకు హాజరయ్యే వారికి ఇబ్బంది కలగకుండా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు ఉండాలని సీపీ స్పష్టం చేశారు.



## దక్షిణాఫ్రికాపై భారత్ జయభేరీ..




ధర్మశాల టీ20 మ్యాచ్‌లో టీమిండియా జయకేతనం ఎగురవేసింది. పర్యాటక సౌతాఫ్రికాను బంతితో పడగొట్టి, బ్యాట్‌తో బెదరగొట్టి విజయం సాధించింది. ధర్మశాల వేదికగా జరిగిన మూడో టీ20లో ఏడు వికెట్ల తేడాతో విక్టరీ నమోదు చేసింది. దీంతో సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో నాలుగో మ్యాచ్ డిసెంబర్ 17న ఏకనా స్టేడియంలో జరుగుతుంది. డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో చివరి మ్యాచ్ జరుగుతుంది. దక్షిణాఫ్రికాతో మూడో టీ20 మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జయకేతం ఎగురవేసింది. ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికాను 117 పరుగులకు ఆలౌట్ చేసిన టీమిండియా.. అనంతరం 15.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ సిరీస్‌లో నాలుగో మ్యాచ్ ఏకనా స్టేడియంలో డిసెంబర్ 17న జరగనుంది. 118 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు.. ఓపెనర్లు శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 32 బంతుల్లో 60 పరుగులు జోడించారు. 18 బంతుల్లో 35 రన్స్ చేసిన అనంతరం అభిషేక్ శర్మ ఔట్ అయ్యాడు. అయితే అభిషేక్ ఔట్ అయ్యాక టీమిండియా ఇన్నింగ్స్ స్లోగా మారిపోయింది. పరుగులు చేసేందుకు బ్యాటర్లు కష్టపడ్డారు. శుభ్‌మన్ గిల్ (28 బంతుల్లో 28 రన్స్), తిలక్ వర్మ (34 బంతుల్లో 25 రన్స్ నాటౌట్), సూర్యకుమార్ యాదవ్ (11 బంతుల్లో 12 రన్స్) స్లోగా బ్యాటింగ్ చేశారు. శివమ్ దూబె 4 బంతుల్లో 10 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. దీంతో భారత్.. 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. సరిగ్గా 20 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ ఎయిడెన్ మార్‌క్రమ్ (61) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ రెండేసి వికెట్లు తీశారు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబె, ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక తాజా ఫలితంతో టీమిండియా ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారత్, రెండో మ్యాచ్‌లో సౌతాఫ్రికా గెలిచాయి. నాలుగో టీ20 మ్యాచ్ లక్నోలోని ఏకనా స్టేడియంలో డిసెంబర్ 17న, ఐదో టీ20 గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో డిసెంబర్ 19న జరుగుతుంది. ఈ రెండింట్లో ఒక్క దాంట్లో గెలిచినా.. సిరీస్ భారత్ వశం అవుతుంది.



**సిరీస్‌లో 2-1 తో లీడ్**